


# విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 04-08-2023 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 47 సంచిక : 260 పేజీలు : 08 వెల : 1 రూపాయి

# వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తా

- సహాయ, పునరావాస కార్యక్రమాలు సమర్థవంతంగా జరగాలి
- ఎక్కడా కూడా విమర్శలకు తావులేకుండా చూడాలి
- టిఆర్-27 నిధులను సకాలంలో విడుదల చేస్తున్నాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



గుంటూరు, (విజయభాను న్యూస్) : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఖరారు అయ్యింది. ఆగష్టు 7, 8 తేదీల్లో ఆయన పర్యటించనున్నారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే ప్రకటించారు. వరద ప్రభావిత జిల్లాలైన అల్లూరిసీతారామరాజు, ఏలూరు, ప.గో, తూ.గో, అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారాయన. ఈ సందర్భంగా.. సహాయ, పునరావాస కార్యక్రమాలు సమర్థవంతంగా జరగాలని కలెక్టర్లను ఆదేశించారాయన. "ఎక్కడా కూడా విమర్శలకు తావులేకుండా చూడాలి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విపత్తుల సమయంలో కలెక్టర్లు సహా, అధికారులకు ముందస్తుగా నిధులు విడుదల చేస్తున్నాం. అవసరమైన వనరులను సమకూరుస్తూ మిమ్మల్ని ఎంపవర్ చేస్తున్నాం. టిఆర్-27 నిధులను సకాలంలో విడుదల చేస్తున్నాం. సహాయ, పునరావాస చర్యలు సమర్థ వంతంగా చేపట్టేలా అన్నిరకాలుగా ప్రభుత్వం తోడుగా నిలిచింది. దీనితర్వాత, ఈ పనులు చేయడానికి కొంత సమయం ఇస్తున్నాం. ఆ తర్వాత నేను స్వయంగా వచ్చి ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మీరు సహాయ పునరావాస కార్యక్రమాలు ఏరకంగా చేపట్టారో స్వయంగా పరిశీలిస్తున్నాను. బాధితులను అడిగి వివరాలు తెలుసుకుంటున్నాను. ఈసారికూడా నేను వస్తాను, క్షేత్రస్థాయిలో మీరు చేపట్టిన చర్యలు, అందించిన సహాయంపై సమీక్ష చేస్తాను అని ఆయన అధికారులకు తెలిపారు.

### ఉదారంగా వ్యవహరించండి

వరద సహాయ కార్యక్రమాల్లో ఉదారంగా వ్యవహరించండి. మనం ఆ పరిస్థితుల్లో ఉంటే ఎలాంటి సహాయం కోరుతామో అలాంటి సహాయమే అందించాలి. ఇంట్లోకి వరదనీరు వచ్చినా, అలాగే వరద కారణంగా సంబంధాలు తెగిపోయిన వారికి కచ్చితంగా నిర్ణయించిన రేషన్ అందించాలి. దీంతోపాటు తాగునీరు కూడా అందించాలి. ఈ సహాయం తరువాయి 2లో..

## ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు

# ఆమోదం



ఢిల్లీ: విపక్షాల ఆందోళనల నడుమే ఢిల్లీ ఆర్డినెన్స్(సవరణ) బిల్లు 2023కి లోక్‌సభ ఆమోదం తెలిపింది. గురువారం సాయంత్రం మూజువాణి(వాయిస్) ఓటుతో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు ఆమోదం లభించింది. దీంతో విపక్షాలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశాయి. అంతకు ముందు విపక్షాలు సైతం బిల్లుపై చర్చల్లో పాల్గొన్నాయి. తమ అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. అనంతరం కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుపై చర్చలో పాల్గొన్నారు. బిల్లుపై అభ్యంతరాలకు సమాధానం ఇచ్చారు. ఈ తరుణంలో వాయిస్ ఓటు జరగ్గా.. విపక్షాల ఆందోళన నడుమే బిల్లుకు ఆమోదం లభించింది. ఆప్ ఎంపీ సుశీల్‌కుమార్ రింక్ బిల్ పేపర్లు చింపి వెల్‌లోకి విసిరేశారు. దీంతో లోక్‌సభ నుంచి సుశీల్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు తరువాయి 2లో..

## ప్రతిపక్షాల సానుభూతిపరుల

# ఓట్ల తొలగింపు

కేంద్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేసిన రాష్ట్ర టిడిపి అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు



విశాఖపట్నం ( విజయభాను న్యూస్ ) :రాష్ట్రంలో వాలంటీర్ల సహాయంతో ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్లు వైసీపీ ప్రభుత్వం తొలగిస్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెంనాయుడు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. గురువారం బీచ్ రోడ్ లోని నోవటల్ హెూటల్లో కేంద్ర ఎన్నికల సంఘం వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించిన సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చంనాయుడు, పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవులు రాష్ట్రంలోని పరిస్థితులు వివరించారు. ఈ సందర్భంగా అచ్చెంనాయుడు మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్లను జగన్ రెడ్డి ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా తొలగిస్తుందని ఆరోపించారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వం వలన ఎదురయ్యే పరిస్థితుల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. 34 ఓట్లకు ఒకే తండ్రి పేరు ఉందని నియోజకవర్గాల వారిగా జరుగుతున్న వధంతాలను కూడా ఎన్నికల సంఘానికి వివరించామని చెప్పారు. తాత్కాలిక మైగ్రేషన్ హెూటల్ ను కూడా తొలగించడం దారుణమని దుయ్యబట్టారు. టిడిపి పిఎసి చైర్మన్ పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా 9 నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టారంటే రాష్ట్రంలో పరిస్థితి ఏ విధంగా ఉందో కేంద్ర ఎన్నికల సంఘం అర్థం చేస్తుందని అన్నారు. ఎన్నికలకు సంబంధించి ఎవరైనా తప్పు చేస్తే శిక్ష తప్పనిసరిగా తరువాయి 2లో..

## కరవు నేలపై కియా పరిశ్రమను ఊహించారా?

తెలుగుదేశం అధినేత చంద్రబాబు



అనంతపురం, (విజయభాను న్యూస్) : పెనుగొండ నియోజకవర్గంలో కియా కార్ల పరిశ్రమను తెలుగుదేశం అధినేత చంద్రబాబు సందర్శించారు. తెదేపా హయాంలో వచ్చిన కియా కార్ల పరిశ్రమ వద్ద సెల్ఫీ తీసుకుని వైకాపా ప్రభుత్వానికి ఛాలెంజ్ విసిరారు. వైకాపా అనంతపురం జిల్లాకు తెచ్చిన పరిశ్రమలు ఎన్ని, తరువాయి 2లో..

## అప్పులపై కేంద్రం క్లారిటీ సరిపోలేదా?



అమరావతి, (విజయభాను న్యూస్) : ఏపీ ఆర్థిక పరిస్థితిపై కొందరు బురద చల్లుతున్నారంటూ ఏపీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. గురువారం ఆయన సచివాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, తమకు తామే ఆర్థిక నిపుణులుగా ప్రకటించుకుని ఇష్టానుసారం తరువాయి 2లో..

## ఇప్పటికైనా నెత్తికెక్కిన కళ్లను కిందకు దించండి

: గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అమరావతిలో ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై ఏపీ హైకోర్టు స్టే విధించడంపై తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్విటర్ వేదికగా స్పందించారు. మొదటినుంచి ఎన్నిసార్లు చెబుతున్నా.. పట్టించుకోకుండా ముందుకెళ్తే ఇలానే ఎదురుదెబ్బలు తగులుతాయన్నారు. "మీ స్వార్ధ రాజకీయ కక్షలతో రాజధాని నిర్మాణాన్ని తరువాయి 2లో..



విశాఖపట్నంలో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ లతో రెండవ రోజు సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ దేవేంద్ర శర్మ, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా.




విశాఖపట్నంలో ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ లతో రెండవ రోజుసమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్‌దేవేంద్ర శర్మ, నితీష్ కుమార్ వ్యాస్, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా, పాల్గొన్న జిల్లా కలెక్టర్ లు

## విశాఖలో ఈనెల 10 నుంచి పవన్ కల్యాణ్ 'వారాహి' యాత్ర



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : జనసేన అధినేత పవన్ కల్యాణ్ మూడో విడత వారాహి విజయ యాత్ర ఈనెల 10 నుంచి విశాఖపట్నంలో మొదలవుతుందని పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. వారాహి యాత్ర ఏర్పాట్లపై ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నాయకులతో ఆయన గురువారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. తరువాయి 2లో..



# అత్యాచారం కేసులో స్పెషల్ ఫోక్సోకోర్టు సంచలన తీర్పు

### 15 ఏళ్ళు జైలు శిక్ష, 50 వేలు జరిమానా విధించిన ఫోక్సోకోర్టు న్యాయమూర్తి ఆనంది

విశాఖపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్): విశాఖ లో 2018 ఏడాదిలో కాలేజీ స్టూడెంట్ పై అత్యాచారం చేసిన కేసులో విశాఖ స్పెషల్ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితునకు 15 ఏళ్ళు జైలు శిక్ష తోపాటు 50 వేలు జరిమానా విధించిన న్యాయమూర్తి ఆనంది. బాధితురాలికి 4 లక్షల రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. దిశా చట్టం పరిధిలో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని, బాధితులకు నాయ్యం జరిగే లాగా దిశ చట్టం స్పీడ్ ట్రయల్ కి ఉపయోగ పడిందని పోక్సో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ పేర్కొన్నారు. విశాఖ సిటీ 4 వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన బాధితురాలిని ఆటో డ్రైవర్ కాలేజీ కి తీసుకొని వెళ్తుండగా మార్గం మధ్యలో 2108 లో అత్యాచారం కి ఒడిగట్టాడు.

నిందితుడికి శిక్ష పడేలా చేసిన ఫోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి ఆనంది కి, ఫోక్సో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ కి కన్నీటి తో బాధితురాలి కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలియజేశారు.

# గాలిగోపురం నుండే దుకాణాలు నిర్మించండి

### ఎమ్మెల్యే అవంతికి వినతిపత్రం అందజేసిన సింహాచల వర్తక సంఘం ప్రతినిధులు



సింహాచలం (విజయభాను న్యూస్) : ప్రభుత్వం చేపడుతున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా దక్షిణ గాలిగోపురం నుండి తమ షాపులు కేటాయించాలని సింహాచలం కొండపైన వర్తక సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్ ను కోరారు. ఈ మేరకు అవంతి కార్యాలయంలో గురువారం ఆయనకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న పునర్నిర్మాణంలో భాగంగా గతంలో మాదిరిగా తమ షాపులు గాలిగోపురం నుండి బయటకు వచ్చే దారిలో ఉండేలా నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. అక్కడనుండి షాపులు ప్రస్తుతం ఉన్న తాత్కాలిక మార్కెట్ వద్దకు మార్చడం వల్ల అనేక సంవత్సరాలుగా వ్యాపారాలు తగ్గి ఇబ్బందులు పడ్డామన్నారు. అలాగే కరోనాలో రెండేళ్లు వ్యాపారాలు లేక నష్టపోయామన్నారు. రెండుసార్లు షార్ట్ సర్క్యూట్ తో షాపులు అగ్నికి ఆహుతయ్యాయన్నారు. ఆర్థికంగా చితకపోయినా 67 షాపులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చేపడుతున్న నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వ్యాపారాలు సాగే చోట నిర్మించి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే అవంతి శ్రీనివాసరావు స్పందిస్తూ వర్తకలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సింహగిరి వర్తక సంఘం అధ్యక్షుడు కిరణ్, కోశాధికారి దొంతల శంకరరావు, సత్తిబాబు, రాజు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# 87 వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



గాజువాక( విజయభాను న్యూస్) : జీవీఎంసీ 87వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. గురువారంజరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని కళింగ వీధి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు 19.89 లక్షలు వ్యయామంతో వి.ఆర్. సి.సి డ్రెయిన్స్, ముస్లిం వీధి మసీదు రోడ్డు గెడ్డ,41 లక్షల వ్యయా ము తో రిటర్నింగ్ వాల్ ను, గణేష్ నగర్, వి. సీ. ఎస్ అపార్ట్మెంట్ దగ్గర 6 లక్షలతో వ్యయంతో కల్వర్ట్ నిర్మాణం కొరకు మొత్తం రూ 66.89లక్షల నిధులతో శంకుస్థాపనలు చేసారు. అనంతరం ప్రజల వద్ద పలు సమస్యలపై వినతి పత్రాలు తీసుకొని సంబంధించిన అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజువాక నియోజకవర్గంను మోడల్ సిటీగా తయారు చేయడం తన లక్ష్యంఅనిఅన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, ఈ ఈ, ఏ ఈ వార్డ్ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ కోమటి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ప్రగడవేణుబాబు, జిల్లా కార్యదర్శి బొడ్డ గోవిందా, వార్డు కార్యదర్శి ముద్దపు దామోదర్, బీసీ సెల్ కార్యదర్శి జిల్లా దుగ్గపు దానప్పలు,మార్పు శేషు, ఎన్నేటి రమణ, ప్రగడ శ్రీనివాస్,జె. ఈశ్వరరావు, ప్రగడ శంకర్రావు అధిక సంఖ్యలో మహిళలు కార్యకర్తలు వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

# అప్పులపై కేంద్రం క్లారిటీ సరిపోలేదా?

మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఏపీ అప్పులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వం ఇంతకంటే ఎక్కువ అప్పులు చేసింది. గతంలో వీరెవ్వరూ ఎందుకు మాట్లాడలేదు" అని బుగ్గన ప్రశ్నించారు. "ఏపీ అభివృద్ధికి కేంద్రం సహకరించకూడదనేదే వీరి కుట్ర. ఏపీకి మంచి జరగకూడదన్నదే వీరి ఆలోచన. రాష్ట్రం శ్రీలంక అయిపోతుందంటూ తప్పుడు ప్రచారం చేశారు. ఏపీ అప్పులపై మాట్లాడేవారు ఎవ్వరూ కూడా రాష్ట్రంలో ఉండటం లేదు. కేవలం ప్రభుత్వంపై బురద చల్లడమే లక్ష్యంగా మాట్లాడుతున్నారు. ఆర్థికశాఖ చెప్పిన సమాధానాన్ని కూడా వీరు నమ్మరు. పార్లమెంట్ సాక్షిగా ఏపీ అప్పులపై వాస్తవాలు బయటపడ్డాయి. ఆ వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత వీరందరూ బాధపడిపోతున్నారు" అని మంత్రి ధ్వజమెత్తారు.

"వెయ్యి కోట్ల అప్పు అంటూ ఐదు సార్లు రాస్తే 5 వేల కోట్లు అవుతుందా?. ఏపీ అప్పులపై కేంద్రం ఇచ్చిన స్టేట్‌మెంట్ ఎందుకు ప్రచురించరు?. రాష్ట్ర అప్పులపై కేంద్రానికి ఫిర్యాదుల మీద ఫిర్యాదులు చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో చేసిన అప్పులపై ఎప్పుడైనా మాట్లాడారా?. నేను సింహాన్ని అంటూ చంద్రబాబు మాట్లాడుతున్నారు ఎందుకు మీరు జంతువులతో పోల్చుకుంటున్నారు?" అంటూ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఎద్దేవా చేశారు.

# కరవు నేలపై కియా పరిశ్రమను ఊహించారా?

పూర్తి చేసిన సాగునీటి ప్రాజెక్టులు ఎన్నో చెప్పాలంటూ చంద్రబాబు ఛాలెంజ్ చేశారు. అనంతపురం జిల్లాలో కియా ప్రపంచం సృష్టించామని గుర్తు చేశారు. ఇదీ తన విజన్ అన్న ఆయన.. విధ్వంసం సైకో నైజమని మండిపడ్డారు. కరవు నేలపై ఎవరైనా కియా పరిశ్రమను ఊహించారా అని ప్రశ్నించారు. అనంతపురం జిల్లాపై తనకున్న ప్రేమతోనే ఈ ప్రాజెక్టు తీసుకొచ్చానని వెల్లడించారు. 6 నెలల్లోనే గొల్లపల్లి పూర్తి చేసి కియాకు నీరిచ్చామన్నారు. రాళ్ల సీమలో కియా సిరులు పండిస్తోంది.. ఇది తెలుగుదేశం పార్టీ విజయమని పేర్కొన్నారు. 10లక్షల కార్లు ఇక్కడి నుంచి ఉత్పత్తి చేసిన ఉద్యోగులు జై బాలయ్య పాటకు డ్యాన్స్ చేశారంటే.. అదీ ఘనత అని తెలిపారు. కియా పరిశ్రమతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపరిచామన్నారు. కియా కార్ల అమ్మకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. ఇక్కడి ఎంపీ బట్టలు విప్పి రోడ్డుపైకి వస్తాడేమోనని తనకే భయం వేస్తోందని ఆక్షేపించారు. కుల, మత, ప్రాంతం పేరుతో ఇష్టానుసారంగా రాజ్యాధికారం చేయనివ్వమని చంద్రబాబు హెచ్చరించారు.

# ఇప్పటికైనా నెత్తికెక్కిన కళ్లను కిందకు దించండి

సర్వనాశనం చేశారు. అమాయక రైతుల జీవితాలతో ఆడుకోవాలని చూశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో ఎలక్ట్రానిక్ సిటీగా పేర్కొన్న ప్రాంతంలో కనీస పరిజ్ఞానం లేకుండా ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని చూశారు. మీ ప్రయత్నాలను ఈరోజు హైకోర్టు తప్పు పట్టి నిర్మాణాలపై స్టే విధించింది. ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసి చెంపదెబ్బ లాంటి తీర్పు ఇచ్చింది. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉండి పేదలకు పట్టాలు ఇవ్వదల్చుకుంటే.. ఆర్-5 జోన్ పరిధిలో లేనివాటిని ఇచ్చి మీ విశ్వసనీయత చాటుకోండి. అంతే కానీ పేదల సంక్షేమం ముసుగులో అమరావతి మాస్టర్ ప్లాన్‌ను ధ్వంసం చేయొద్దు. చట్టాలు మీకు చుట్టాలు కావనే సత్యాన్ని గ్రహించి ఇప్పటికైనా నెత్తికెక్కిన మీ కళ్లను కిందకు దించండి" అని గంటా శ్రీనివాసరావు ట్వీట్ చేశారు.

## విశాఖలో ఈనెల 10 నుంచి పవన్ కల్యాణ్ 'వారాహి' యాత్ర

గత రెండు విడతల్లో నిర్వహించిన వారాహి విజయ యాత్రను మించిన స్థాయిలో విశాఖ నగరంలో చేసే యాత్ర ఉండాలన్నారు. నాయకులు, వీర మహిళలు, జన సైనికులు అంతా సమష్టిగా పని చేసి వారాహి యాత్ర ఉద్దేశాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. యాత్రలో భాగంగా విశాఖలో జనవాణి కార్యక్రమం ఉంటుందన్నారు. విశాఖలో భూకబ్జాలు, పర్యావరణం ధ్వంసమైన ప్రాంతాలను క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా వివిధ వర్గాల ప్రజలతో పవన్ కల్యాణ్ సమావేశమై సమస్యలను తెలుసుకుంటారని వివరించారు. ఈనెల 19వరకు వారాహి యాత్ర కొనసాగుతుందని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# పార్టీ విజయం కోసం శ్రమిస్తాను

### - వైసీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



మద్దిలపాలెం (విజయభాను న్యూస్ ) : రానున్న ఎన్నికల్లో విశాఖలోని అన్ని నియోజకవర్గాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులను, ఎంపీని గెలిపించేందుకు పూర్తి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు చెప్పారు. మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తనకప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభ్యున్నతికి పాటు పడతానన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని వైసిపి విజయం సాధించేందుకు సన్నద్ధమవుతామని చెప్పారు. సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారు అన్నారు. వైసీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశం లో కార్పొరేటర్ లు చెన్న జానిక రామ్, ఉరికూటి నారాయణ,కృపా జ్యోతి, బొండా ఉమా మహేష్, కలదిండి బాధిరినాథ్,అల్లంపల్లి రాజబాబు, కృష్ణం రాజు, చొక్కర శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# నేడు భీమిలి మండలం లో పలుచోట్ల విద్యుత్ కు అంతరాయం

భీమునిపట్నం : విజయభాను న్యూస్ : చిట్టివలస రూరల్ సెక్షన్ నందు గల 11 కెవి, బోడమెట్టపాలెం నిర్వహణ, చెట్ల నరికివేత పనిని చేపట్టాలని ప్రతిపాదించబడడంతో భీమిలి మండలం లో బోడమెట్ట పాలెం, రామునాయుడుపేట, ముద్దాడపేట, అల్లుపేట రెల్లిపేట,దాకమర్రి తదితర ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదనీ విశాఖ ఆపరేషన్ జోన్ - 3,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

# వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తా

అదని వరద బాధిత కుటుంబం ఉండకూడదు. సహాయ శిబిరాల్లో ఉండి, వారు తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు ప్రతి కుటుంబానికి రూ.2000, వ్యక్తులైతే రూ.1000లు ఇచ్చి పంపించాలి. కలెక్టర్లు బాగా చూసుకున్నారనే మాట వినిపించాలి అని అధికారులతో సీఎం జగన్ అన్నారు.

వరద కారణంగా కచ్చా ఇల్లు పాక్షికంగానైనా, పూర్తిగా నైనా ధ్వంసం అయితే ఎట్టిపరిస్థితుల్లోనూ వర్గీకరణ చేయొద్దు. వారందరికీ కూడా రూ.10 వేలు చొప్పున సహాయం అందించాలి. వరదనీరు తగ్గగానే పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించండి. మిగిలిన ప్రాంతాలనుంచి వరద బాధిత ప్రాంతాలకు పారిశుద్ధ్య కార్మికులను తరలించండి. వైద్యశిబిరాలను కొనసాగించండి పీహెచ్‌సీల్లో, విలేజ్ క్లినిక్స్‌లో సరిపడా మందులు ఉండేలా చూసుకోండి. పాముకాట్లకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచేలా చూసుకోండి. పంట నష్టం, ఆస్తి నష్టంపై వెంటనే ఎన్యుమరేషన్‌చేసి గ్రామ, వార్డు సచివాలయాల్లో సోషల్ ఆడిట్‌కోసం జాబితాను ఉంచండి. అత్యంత పారదర్శకంగా పంటనష్టానికి, ఆస్తి నష్టానికి సంబంధించిన పరిహారం అందించండి. అవసరమైన చోట వెంటనే కొత్త ఇళ్లను మంజూరు చేయండి. ఏటిగట్లమీద ఉన్నవారికి పక్కా ఇళ్లను మంజూరు చేయండి. వరద వచ్చిన ప్రతిసారి వారు ఇబ్బందిపడకుండా వారికోసం ఇళ్లను మంజూరుచేయాల్సిన బాధ్యత కలెక్టర్లది. అలాంటి ప్రమాదకర ప్రాంతాల్లో ఉండేవారికి రక్షిత ప్రాంతంలో ఇళ్లు ఇవ్వాలి. వారికి శాశ్వతంగా పరిష్కారం చూపాల్సిన బాధ్యత మనది. అవసరమైన స్థలాన్ని సేకరించి, వారికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లను మంజూరు చేయండి. పోలవరం ఎగువన తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలకు ఆర్ అండ్ ఆర్ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఇవ్వండి. పశువులకు గ్రాసం కొరతలేకుండా చూడండి. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు తదితర నిర్మాణాల విషయంలో వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వరద బాధిత ప్రాంతాల్లో రక్షిత తాగునీటి సరఫరాను కొనసాగించాలి. పరిస్థితి మెరుగుపడేంతవరకూ వారికి రక్షిత తాగునీటిని అందించాలి. సోమ, మంగళవారాల్లో నేను వరద బాధిత ప్రాంతాల్లో పర్యటిస్తాను. వరద బాధిత ప్రాంతాలకు నేను వచ్చినప్పుడు ఈ అంశాలకు సంబంధించి ఎవ్వరూ కూడా ఫిర్యాదులు చేయకూడదు. నేను ఎక్కడకు వచ్చేదీ కొన్ని ఆదివారం సాయంత్రం సీఎంవో అధికారులు మీకు వెల్లడిస్తారు. క్షేత్రస్థాయిలో వరద బాధితులకు అందిన సహాయ, పునరావాసం కార్యక్రమాలను స్వయంగా పరిశీలిస్తాను అని కలెక్టర్లతో పేర్కొన్నారాయన.

# ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

స్పీకర్. లోక్‌సభ క్లియరెన్స్‌తో రేపు రాజ్యసభ ముందుకు ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లు చర్చకు రానుంది.

అసలు సీన్ రాజ్యసభలోనే..

ఢిల్లీ సర్కారు అధికారాలకు కత్తెర వేస్తూ కేంద్ర సర్కారు మే 19న ఇచ్చిన ఆర్డినెన్స్‌పై దేశవ్యాప్తంగా వాడీవేడి చర్చ జరుగుతోంది. అది నిరంకుశ ఆర్డినెన్స్ అని బీజేపీ వ్యతిరేక కూటమిలోని పార్టీలు గొంతు చించుకుంటున్నాయి. రాజకీయ వైరుధ్యాలను పక్కకు పెట్టి ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ సర్కార్‌కు మద్దతును ప్రకటిస్తున్నాయి. ఆ ఆర్డినెన్స్‌కు సంబంధించిన బిల్లు.. లోక్ సభ , రాజ్యసభ రెండూ ఆమోదిస్తేనే చట్టంగా మారుతుంది. అయితే రాజ్యసభలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు 110 మంది ఎంపీలే ఉన్నారు. కాంగ్రెస్‌సహా అన్ని విపక్ష పార్టీలు కలుపుకుని 128 మంది ఎంపీలు ఉన్నారు. దీంతో.. పెద్దల సభలో బిల్లును ఓడించాలనే ధీమాతో విపక్ష ఇండియా కూటమి ఉంది.

ఆర్డినెన్స్‌లో ఇలా..

ఢిల్లీలో పాలనాధికారం అసెంబ్లీకే ఉంటుందని.. అధికారుల బదిలీలు, నియామకాల్లోనూ అక్కడి ప్రభుత్వానిదే తుది నిర్ణయమని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం మే 11న తీర్పు ఇచ్చింది. అయితే తీర్పును పక్కన పెడుతూ మే 19న కేంద్రం కొత్త ఆర్డినెన్స్ తెచ్చింది. నగర పాలనపై అసాధారణ అధికారాలను లెఫ్టినెంట్ గవర్నర్ చేతుల్లో పెడుతూ ఆర్డినెన్స్ జారీచేసింది. ఢిల్లీలో గ్రూప్%--%ఏ అధికారుల పోస్టింగ్, బదిలీలపై ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను తొలగిస్తూ.. దాని స్థానంలో కొత్తగా నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీని ఏర్పాటు చేసింది. ఫలితంగా ఢిల్లీలోని అధికారుల పోస్టింగ్, బదిలీలతోపాటు విజిలెన్స్ అధికారాలు ఎల్జీ చేతిలోకి వెళ్లాయి. నేషనల్ క్యాపిటల్ సివిల్ సర్వీస్ అథారిటీకి చైర్మన్‌గా ఢిల్లీ సీఎం ఉంటారు. మెంబర్లుగా సీఎస్, హోంశాఖ కార్యదర్శి ఉంటారు. ఢిల్లీలో ఏ అధికారిని బదిలీ చేయాలన్నా, పోస్టింగ్ ఇవ్వాలన్నా ఈ ముగ్గురు సమావేశమై, ఓటింగ్ నిర్వహించి ఎల్జీకి నివేదించాలి. మెజారిటీ ప్రతిపాదికన నిర్ణయం తీసుకుంటారు. ఎప్పుడైనా ఓటింగ్ లో ఫలితం తేలకుంటే.. లెఫ్టినెంట్ గవర్నర్‌దే తుది నిర్ణయంగా ఉంటుంది. నగరంలోని పోలీస్ వ్యవస్థ మొత్తం ఇప్పటికే ఎల్జీ చేతిలో ఉంది. దేశ రాజధానిలో శాంతిభద్రతల బాధ్యత మొత్తం ఎల్జీదే. సివిల్ అధికారులపై ఢిల్లీ ప్రభుత్వానికి అజమాయిషీ ఉండేది. తాజా ఆర్డినెన్స్‌తో ఆ అధికారాలు కూడా లేకుండా పోతాయి.

ఇప్పటిది కాదు..

ఢిల్లీలో ఎవరి అధికారాలు ఏంటన్న దానిపై 2015 నుంచే వివాదం నడుస్తోంది. కేంద్రంలో మోదీ సర్కార్ రాగానే.. ఢిల్లీ పాలనాధికారాలను మొత్తం లెఫ్టినెంట్ గవర్నర్ చేతిలో పెట్టింది. అప్పుడే కొత్తగా ఏర్పడిన అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వాన్ని డమ్మీని చేసేందుకే కేంద్రం ఇలాంటి నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలు వినిపించాయి. కేంద్రం నిర్ణయంపై కేజ్రీవాల్ ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు వెళ్లటంతో.. కేంద్రం నిర్ణయాన్ని కోర్టు సమర్థించింది. దీంతో కేజ్రీ సర్కార్ సుప్రీంకోర్టు తలుపు తట్టింది. ఈ వివాదాన్ని విచారించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం.. ఎల్జీ, ఎన్నికైన ప్రభుత్వం మధ్య స్పష్టమైన అధికారాల విభజనను సూచిస్తూ ఈ నెల 11న తీర్పు ఇచ్చింది. ఢిల్లీ నగరంలో శాంతిభద్రతల బాధ్యత మాత్రమే ఎల్జీదని, ఇతర శాసన, కార్యనిర్వాహక బాధ్యతలు అసెంబ్లీకే చెందుతాయని తీర్పు ఇచ్చింది.

సుప్రీం తీర్పును కాదని..

అయితే సుప్రీం తీర్పు వచ్చి వారం గడవక ముందే ఆ తీర్పును కాదని కేంద్రం కొత్త ఆర్డినెన్స్ తెచ్చింది. దేశ ప్రయోజనాల దృష్ట్యా నగరంలో అధికారాల సమతుల్యత కోసమే ఈ ఆర్డినెన్స్ తెచ్చామని కేంద్రం వాదిస్తోంది. కానీ ఆప్ ప్రభుత్వం మాత్రం ఇది రాజ్యాంగ విరుద్ధ నిర్ణయం అంటోంది. ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని పేర్కొంటోంది.

ప్రజాస్వామ్య ప్రభుత్వంలో జోక్యమే ఇది..

రాజ్యాంగం ప్రకారం.. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలే పాలన సాగించాలి. కానీ ఢిల్లీ విషయంలో మాత్రం కేంద్రం ఆ అవకాశం లేకుండా చేస్తోందని విపక్ష ఇండియా కూటమి నేతలు అంటున్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల పాలనలో కేంద్రం జోక్యం చేసుకుంటోందని, అవసరమైతే కూలుస్తోందని ఆరోపిస్తున్నాయి. ఇప్పుడు అధికారాలు కూడా కోత పెడితే ప్రజాస్వామ్యానికి అర్థం ఉండదని విపక్షాల వాదనం. ఈ నేపథ్యంలో బిల్లును ఎలాగైనా అడ్డుకోవాలని పట్టుదలతో ప్రయత్నిస్తున్నాయి. మరోవైపు కేంద్రం కూడా ఈ వ్యవహారాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

బిల్లు పెట్టిన అమిత్‌షా..

ఈ వివాదం కొనసాగుతుండగానే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఆర్డినెన్స్ బిల్లును మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల వ్యతిరేక నినాదాల మధ్యనే బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సభ వాయిదా పడింది. అయితే లోక్‌సభలో సంఖ్యాబలం ఉన్నందున బిల్లు సులువుగానే పాస్ అయయ్యింది.

# ప్రతిపక్షాల సానుభూతిపరుల ఓట్ల తొలగింపు

పడుతుందని ఎన్నికల సంఘం హెచ్చరించిందని చెప్పారు. రూల్ ఆఫ్ లా లేకుండా ఎన్నికల సంఘానికి స్వతంత్రానికి విఘాతం ఏపీ ప్రభుత్వం కలిగించిందని ఆరోపించారు. అనుభవం లేని సచివాలయం సిబ్బందిని ఎన్నికలకు ఉపయోగించవద్దని సూచించినట్టు తెలిపారు. మేము సూచించిన అభ్యర్థనలకు కేంద్ర ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘంని కలిసిన వారిలో తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు శాసనసభ మాజీ సభ్యులు దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గండి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- ఆహారపు అలవాట్లలో నియమాలు పాటించాలి**

**- వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కిట్స్ అందజేసిన కార్పొరేటర్ అనిల్ కుమార్ రాజు**



సీతమ్మధార (విజయభాను న్యూస్): చిన్నపిల్లలు, గర్భిణీలు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టిక ఆహారాన్ని తీసుకున్నప్పుడే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని గ్రేటర్ విశాఖ 14 వ వార్డు కార్పొరేటర్ కటారి అనిల్ కుమార్ రాజు తెలియజేశారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం ఏ.ఎస్.ఆర్ నగర్ లో వార్డు కార్పొరేటర్ కటారి.అనిల్ కుమార్ రాజు ముఖ్యఅతిథిగా హాజరై వైఎస్సార్ సంపూర్ణ పోషణ ( టేక్ హోమ్ రేషన్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు వైయస్సార్ సంపూర్ణ పోషణ కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ రాజు మాట్లాడుతూ మారుతున్న కాలాలకు అనుకూలంగా ఆహార అలవాట్లలో నియమాలు పాటించాలని తెలియజేశారు.

ఇంటి వద్ద తయారుచేసిన పౌష్టిక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సుజాత,వార్డు మహిళా సంరక్షణ కార్య దర్శులు శ్యామల,మంగ,ఆరోగ్య కార్యదర్శి హేమలత,ఆశ వర్కర్స్ భవాని, జుబెద వైఎస్ఆర్సిపి నాయకులు సత్యనారాయణ, పెంటయ్య హాజరైనారు.



# ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా గ్రీవెన్స్

**- వినతులను నేరుగా స్వీకరించిన కె.కె రాజు**



సీతమ్మధార (విజయభాను న్యూస్) : విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె కె రాజు గురువారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భం గా నియోజక వర్గం నుండి పలువురు కార్యాలయంకు విచ్చేసి తమ సమస్యలను కె కె రాజు కి స్వయంగా వచ్చి విన్నవించారు. వారి వద్ద నుండి సంబంధిత వినతి పత్రాలు, దరఖా స్తులు తీసుకుని అధికారులతో మాట్లాడి కొన్ని వెంటనేపరిష్కరించారు. మరికొన్ని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు.

# కె.జి.హెచ్ లో వైద్య సేవలు సంతృప్తి కరం

**ఎస్.టి కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఉత్తరాంధ్ర జిల్లాల నుండి వైద్యం కోసం వచ్చే రోగులకు అందుతున్న వైద్య సేవలు సంతృప్తికరం గా ఉన్నాయని ఎస్.టి కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు అన్నారు. మన్యం జిల్లా కురుపాం నుండి ప్రస్తుతం కె.జి.హెచ్ లో చికిత్స పొందుతున్న మాజి శాసన సభ్యులు జయరాజు ను పరామర్శించేందుకు గురువారం ఉదయం ఎస్.టి కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు వచ్చారు. రాజేంద్ర ప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న మాజీ శాసన సభ్యులు జయరాజు ను పరామర్శించి, అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసు కున్నారు. అతనికి అందుతున్న మెరుగైన వైద్య సేవల పట్ల సంతృప్తిని వ్యక్తం చేసారు. అనంతరం కె.జి.హెచ్ లో ఉన్న ఎస్.టి సెల్ సందర్శించి రిజిష్టర్లు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలు అందించడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో వైద్య సేవలు ఇదే రీతిలో కొనసాగించాలని ఆశాభావం వ్యక్తం చేసారు. ఎస్.టి , ఎస్.సి లకు అందించే వైద్య సేవల విషయంలో మాజీ శాసన సభ్యులు జయరాజు సూచనలు కూడా పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

అదే విదంగా గిరిజన ప్రాంతాల నుండి వచ్చే రోగులకు ట్రైబుల్ సెల్ ద్వారా అంబులెన్స్ సదుపాయాల పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కె.జి.హెచ్ సూపరింటెండెంట్ డా.సివానంద్, డా.సత్యప్రసాద్, డా.సంపత్, కె.జి.హెచ్ సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

# ఆర్5 జోన్ లో ఇళ్ల నిర్మాణం పై హైకోర్టు స్టే

**హర్షం వ్యక్తం చేసిన టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఏపీ రాజధాని అమరావతిలో ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాన్ని నిలివేయాలని హై కోర్ట్ స్టే ఇవ్వడంపై తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ హర్షం వ్యక్తం చేసారు.గురువారం రైతులు వేసిన పిటీషన్‌పై జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్, జస్టిస్ రవినాథ్ తిల్హారిలతో కూడిన హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం గురువారం స్టే విధిస్తూ ఇచ్చిన తీర్పుపై నజీర్ స్పందిస్తూ కోర్టులు ఎన్ని మొట్టికాయలు వేసినా ప్రభుత్వం తనతీరు మార్చుకోవటం లేదన్నారు. మూడురాజధానులపేరుతో అమరావతి ప్రాంత రైతుల జీవితాలతో ఆడుకున్న జగన్మోహన్ రెడ్డికి హైకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు.

పరిపాలనపై అవగాహనా లేకుండా ప్రజలను మభ్యపెడుతూ ఆర్-5 జోన్‌లో జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల పట్టాలను అందజేసిన ఏపీ ప్రభుత్వం పేదలకు సమాధానం చెప్పాలని నిలదీశారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి కక్షసాధింపు చర్యలకు ఫుల్ స్టాప్ పెట్టి రాష్ట్రాభివృద్ధిపై ద్రుష్టి సారించి రాష్ట్రా ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా అమరావతిని రాజధానిగా ప్రకటించాలని నజీర్ కోరారు.

# రైల్వే డిఆర్ఎం తో ఏపీ బీజేపీ ప్రోటోకాల్ కన్వీనర్ భేటీ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : నూతనంగా బాధ్యతలు చేపట్టిన రైల్వే వాల్తేర్ డి ఆర్ ఎమ్ సౌరభ్ ప్రసాద్ ను బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రోటోకాల్ కన్వీనర్ బాల రాజేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు, అనంతరం ఈ నెల 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రారంభిస్తున్న "అమృత భారత్" స్టేషన్ అభివృధి కార్యక్రమం కోసం మరియు తదితర రైల్వే అంశాలు పై చర్చించారు.

# అయోధ్య రామ పాదుకులకు ప్రత్యేక పూజలు

**- మురళీనగర్ సీతారామ ఆలయంలో అయోధ్య శ్రీరామ పాదుకల సందర్శన యాత్ర**

**- జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన మురళినగర్ ప్రాంతం**





మాధవధార/మురళీనగర్ (విజయభాను న్యూస్) : గ్రేటర్ విశాఖ 50 వ వార్డు ప్రాంతంలోని మురళీనగర్ సీతారామ ఆలయంలో అయోధ్య శ్రీరామ పాదుకలకు భక్తులు పూజలను వైభవంగా నిర్వహించారు. శ్రీరాముని పాదుకల రాకతో మురళినగర్ వాసులు, ఆలయ పండితులు పూర్ణకుంభంల నడుమ స్వాగతం పలికారు.

అయోధ్య భాగ్యనగర శ్రీ సీతారామ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేశవ్యాప్త సందర్శనలో భాగంగా శ్రీరామ పాదుకలు స్థానిక మురళీనగర్ సీతారామ ఆలయంలో చేరుకున్నాయి.ఈ సందర్భంగా భక్తులు రాములు వారి పాదాలకు పాలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు పాదుకలను దర్శించారు.జై శ్రీరామ్ అంటూ భక్తితో నమస్కరించి పాదాలను తాకారు.ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ దేవాలయాలలో శ్రీరామ పాదుకలను భక్తుల సందర్శనార్థం ఉంచి,అక్కడి వేద పండితులు, అర్చకులతో పూజలు చేసి సాగర్‌నగర్‌లోని ఇస్కాన్, శ్రీకూర్మం, అరసవిల్లి, పూరీ, ద్వారకా, బదరీనాథ్ వంటి పుణ్యక్షేత్రాలలో పూజలు చేసిన తర్వాత అయోధ్యకు పాదుకలు చేర్చుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు టి నారాయణ రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# యానంలో వ్యవసాయం చేసే పరిస్థితులు కనిపించడం లేదు



యానం. విజయభాను. ఆగస్టు 3. కేంద్రపాలిత ప్రాంతమైన యానంలోని వ్యవసాయం చేసుకునేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవని యానం రైతు సంఘం నాయకులు పరిపాలన అధికారి మునుస్వామికి వింత పత్రం అందజేశారు గురువారం ఉదయం స్థానిక పరిపాలన అధికారి కార్యాలయంలో రైతులు ఆయన కలసి మినపత్రం అందజేసి ఆయన దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు వ్యవసాయ శాఖ ప్రజా పనులు రెవెన్యూ విద్యుత్ శాఖ అధికారులు రైతులకు ఏ విధంగా సహకరించడం లేదని ఆయన దృష్టి తీసుకొచ్చారు పంటకాలలో ద్వారా సాగునీరు సరిగా రావడం లేదని దీనికి సంబంధించిన ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్నారు అధికారుల దృష్టికి ఆఫీసులు చుట్టూ తిరిగి సమస్యలు వింత పత్రం ద్వారా తెలియజేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు వర్షాలు కురిసే ఇదే సమయంలో సాగునీరు అందకపోవడం చాలా దురదృష్టకరమన్నారు తక్షణం రైతు సమస్యలు పరిష్కరించి వరి నాట్లు వేసుకునేందుకు అన్ని చర్యలు చేపట్టాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో రైతు నాయకులు విష్ణువర్ధన్ రావు కోన కొండబాబు మాజీటి సత్యభాస్కర్ మెల్లం శీను కోరుకొండ బాలయోగి పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు

# విజయభాను సంపాదకీయం

## గ్రామ స్థాయి నుండే పజాస్వామ్య స్ఫూర్తి

గ్రామ స్థాయి నుండే పజాస్వామ్య స్ఫూర్తి పరిఢవిల్లాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. అందుకే రాజ్యాంగంలోని నలభయ్యవ అధికరణంలో స్థానిక స్వపరిపాలన ప్రాముఖ్యతను గురించి పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో మినహా దాదాపు అన్ని రాష్ట్రాల్లో పంచాయతీ వ్యవస్థను పాలకులు నిర్వీర్యం చేస్తూ వచ్చారు. వాటికి నిధులు, విధులు కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ పంచాయతీలను మరింత బలహీనం చేసింది. ప్రభుత్వ పథకాలు, సేవలు ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థ సకాలంలో పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి కొంత తోడ్పడింది. అయితే ఎన్నికైన గ్రామ ప్రజా ప్రతినిధుల ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించివేసింది. మరోవైపు పంచాయతీలకు రావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలకు మళ్ళించుకుంటుంది. అందువల్ల పంచాయతీలు తమ కనీస విధులను నిర్వహించలేకపోతున్నాయి. కీలకమైన విషయాన్ని వదిలేసి సమస్యలన్నింటికీ వాలంటీర్లు మూలమైనట్లు, మహిళల అదృశ్యానికి వీరే కారణమైనట్లు జనసేన నేత మాట్లాడడం, వాలంటీర్లు వైసిపి ఏజెంట్లు అంటూ ప్రచారం చేస్తున్న టిడిపి నేతలు తాము అధికారంలోకి వస్తే వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయబోమని చెప్పడం ద్వారా ఇప్పుడున్న వారిని తొలగించి తమ వారిని నియమించుకుంటామనే అర్థంలో మాట్లాడుతున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య మనుగడలో పంచాయతీ వ్యవస్థ స్ఫూర్తి, దాని పురోగతి అత్యంత కీలకమనే విషయాన్ని పాలక పార్టీలు ఉద్దేశ్యపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నాయి. పంచాయతీ వ్యవస్థ ఆవిర్భావం

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు, జిల్లా బోర్డులు అనే మూడంచల పాలన వ్యవస్థ ఏర్పడింది. గ్రామ పరిపాలన ప్రాధాన్యత గురించి మొదటి పార్లమెంట్ సమావేశాల్లోనే కమ్యూనిస్టులు లేవనెత్తారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా తెలంగాణలో జరిగిన రైతాంగ సాయుధ పోరాటం ద్వారా ఏర్పడిన గ్రామస్వరాజ్య విధానం పాలకులు గ్రామ పరిపాలన అమలు చేసేటట్లు ఒత్తిడి చేసాయి. బల్వంతరారు మెహతా ఆధ్వర్యాన పంచాయతీరాజ్ వ్యవస్థ పరిశీలన కోసం కమిటీ ఏర్పడింది. ఈ కమిటీ సిఫార్సులతో 1959లో పంచాయతీ వ్యవస్థ ఏర్పడింది. దేశంలో మొట్టమొదటిసారి ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అలాంటి పంచాయతీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీని ద్వారా పంచాయతీలు, పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి. తెలుగు ప్రజలు గతంలో కొంత భాగం మద్రాసు రాష్ట్రంలో, మరికొంత నిజాం ప్రభుత్వంలో వుండడం వల్ల ఈ రెండు ప్రాంతాలకు రెండు పంచాయతీ చట్టాలు వుండేవి. మద్రాసు గ్రామ పంచాయతీ చట్టం- 1950, హైదరాబాద్ గ్రామ పంచాయతీ చట్టం- 1956 లను 1964లో రద్దు చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం ఏర్పడింది. ఆ తర్వాత కొంత కాలానికి పంచాయతీ సమితులు, గ్రామ పంచాయతీల పనితీరు పరిశీలించిన అశోక్ మెహతా కమిటీ 1978లో తన సిఫార్సులు చేసింది. దాని ఫలితంగా 1986లో 330 పంచాయతీ సమితుల స్థానంలో 1096 మండల పరిషత్తులు ఏర్పడ్డాయి.

దేశవ్యాపితంగా స్థానిక స్వపరిపాలన పటిష్టంగా అమలు చేయడం కోసం 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా రాజ్యాంగంలో 9, 9ఎ విభాగాలను అదనంగా చేర్చారు. 11వ షెడ్యూల్ ద్వారా 29 అంశాలు నిర్వహించడానికి గ్రామ పంచాయతీలకు పూర్తి అధికారాలు ఇచ్చారు. దీనిద్వారా ప్రజలకు అవసరమైన ప్రాథమిక, కనీస సదుపాయాలు కల్పించడం, వాటిని నిర్వహించడం పంచాయతీల పరిధిలోకి వచ్చింది. గ్రామీణ వ్యవస్థ లోని భూస్వాములు, ధనిక రైతాంగం పంచాయతీ ఎన్నికలు జరగకుండా, తమ పెత్తనాన్ని కొనసాగించుకునేందుకు మొదటి నుండి ప్రయత్నించారు. అయితే సిపిఎం నాయకత్వంలో బెంగాల్, కేరళ, త్రిపుర రాష్ట్రాల్లో ఏర్పడిన వామపక్ష ప్రభుత్వాలు పంచాయతీల ఎన్నికలకు, వాటి నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చాయి. గ్రామ సభలు నిరంతరం జరపడం ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులకు పాలనలో నిజమైన భాగస్వామ్యం కల్పించారు. అందులో ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం, ప్రతి ఐదు సంవత్సరాలకు క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించడం జరిగింది. ఆ రాష్ట్రాల బడ్జెట్ నుండి గ్రామ పంచాయతీలకు 30 నుండి 37 శాతం నిధులు కేటాయించేవారు. ఈ నిధులను గ్రామ పంచాయతీలకు బదిలీ చేయడం, వాటి ద్వారా ప్రజా సేవ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఆదర్శవంతమైన గ్రామపాలన అందించారు. అందుకే ఈ రాష్ట్రాల పంచాయతీలు దేశంలోనే కాదు ప్రపంచ మన్ననలు పొందాయి. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికలు నిర్దిష్ట గడువులో నిర్వహిస్తేనే కేంద్రం నిధులు విడుదల చేసే విధంగా నిబంధనలు మార్చాల్సి వచ్చింది. మంచి లక్ష్యంతో ఏర్పడిన పంచాయతీ రాజ్ వ్యవస్థ ప్రారంభం నుండి విధులు, నిధుల కొరతను ఎదుర్కోవలసి వచ్చింది.

# అన్నా క్యాంటీన్ ను ప్రారంభించిన శ్రీ భరత్



శృంగారపు కోట (విజయభాను న్యూస్): పేదలకు, శ్రామికులకు పట్టేడుఅన్నం అందించే దిశగా దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రవేశపెట్టిన రెండు రూపాయలకు కిలో బియ్యం నుండి బాబు అన్న క్యాంటీన్లే నిదర్శనం. శృంగవరపుకోట నియోజకవర్గం, ఎస్ కోట సెంటర్లో కార్మికులకు పేదవారికి అందుబాటులో ఉండే విధంగా అన్నా క్యాంటీన్ ను విశాఖపట్నం టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ భరత్ ప్రారంభించారు. రోజుకు సుమారు 300 మంది వరకు ఉచిత భోజనం సదుపాయం కల్పించే దిశగా కోళ్ల లలిత ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ని ప్రారంభించడం జరిగింది.

# జీవీఎంసీ కమీషనర్ తో ఎమ్మెల్యే వాసుపల్లి భేటీ



జగదాంబ (విజయభాను న్యూస్): దక్షిణ నియోజకవర్గం పరిధిలో రోడ్లు విస్తరణ పనులను వేగవంతం చేసి త్వరిత గతిన పూర్తి చేయాలనీ జీవీఎంసీ కమీషనర్ సీఎం సాయి కాంత్ వర్మ కు విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యుడు వాసుపల్లి గణేష్ కుమార్ వినతి పత్రం సమర్పించారు.

ఇందులో భాగంగా 30వార్డ్ లో అంబేద్కర్ కల్యాణమండపం నుండి కోడిపందాల వీధి వరకు 30అడుగుల రోడ్డు విస్తరణ చేయాలన్నారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమీషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు 36వ వార్డ్ ప్రెసిడెంట్ మాసిపోగు రాజు హాజరయ్యారు.

# బీసీవై పార్టీకి సంపూర్ణ మద్దతు

- ఆంధ్ర ప్రదేశ్ లో పరిస్థితులు బాలేవు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల తరపున పోరాడండి
- రామచంద్ర యాదవ్ కి పూర్తి మద్దతు తెలిపిన అఖిలేష్ యాదవ్



న్యూఢిల్లీ/ లక్నో (విజయభాను న్యూస్): ఆంధ్ర ప్రదేశ్ లో నూతనంగా ఆవిర్భవించిన భారత చైతన్య యువజన పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు ఏ మాత్రం బాలేవని.మీ వంటి పార్టీ, నాయకత్వం అక్కడ అవసరమని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ నీ ఉద్దేశించి ఆయన పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం లక్నోలో ఈ ఇద్దరి భేటీ జరిగింది. దేశ వ్యాప్త రాజకీయ పరిణామాలు సహా, ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ అంశాలపైనా విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు అండగా బీసీవై పార్టీ నిలుస్తుందని అఖిలేష్ యాదవ్ తన ఆశాభావం వ్యక్తం చేశారు. రామచంద్ర యాదవ్ గారికి అండగా అన్ని వర్గాలు నిలవాలని పిలుపునిచ్చారు..

# వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ



రాజాం (విజయభాను న్యూస్) : రాజాం నియోజకవర్గం పరిధిలోని రాజాం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్న రాజాం శాసనసభ సభ్యులు కంబాల జోగులు, శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్ లు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల్లో పోషకాహారలోపం వల్ల కలిగే రక్తహీనత,ఎదుగుదల లోపం, మాతాశిశు మరణాలు తదితర ఆరోగ్య సమస్యలను నివారించి సుసంపన్నమైన,ఆరోగ్యవంతమైన భావి భారత పౌరులను తీర్చిదిద్దే లక్ష్యంతో మన ప్రభుత్వం వైఎస్ఆర్ సంపసూర్ణ పోషణ కిట్లు అందిస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ కన్వీనర్ శ్రీ పాలవలస శ్రీనివాసరావు, ఎంపీపీ ప్రతినిధి లావేటి రాజగోపాల్ నాయుడు, జడ్పిటిసి బంది నరసింహులు, వైస్ ఎంపీపీలు, మండల పరిధిలోని సర్పంచులు,ఎంపీటీసీ లు, వంగర మండల జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శన్ రావు, ఐసీడీఎస్ సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ, సూపర్ వైజర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# విండ్ బాల్ క్రికెట్ పోటీల గోడపత్రిక ఆవిష్కరణ



గాజువాక( విజయభాను న్యూస్) : గాజువాక పాతకర్నవానిపాలెం బిజెపి గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు క్యాంపు కార్యాలయంలో శ్రీ పోలమాంబ యూత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విండ్ బాల్ క్రికెట్ పోటీల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఆజాతీ కా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో బాగంగా స్వతంత్రం వచ్చి 75 సం.లు పూర్తి అయిన సందర్భంగా శ్రీ పోలమాంబ యూత్ గొంతునవానిపాలెం వారి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విండుబాల్ క్రికెట్ పోటీలు ఆగస్టు 12 నుంచి 15వ తేదీ వరకు ఆదర్శ గ్రౌండ్ లో జరగనున్నాయని అన్నారు. మొదటి స్థానంలో గెలుపొందిన వారికి ఇరవై వేల నగదు ట్రోఫీ, రెండవ స్థానంలో గెలుపొందిన వారికి 12000 నగదు ట్రోఫీ మూడో స్థానంలో గెలుపొందిన వారికి ఎనిమి వేల రూపాయల నగదు బహుమతులు అందజేస్తారని తెలిపారు . ఆగస్టు 15 న రక్తదాన శిబిరం ,వైద్య శిబిరం ,దంత పరీక్షలు నిర్వహించబడునని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో నాయకులు మజ్జి.జగదీష్,గొంతిన .సురేష్ రెడ్డి, గొంతిన అశోక్ , సందీప్ , సంతోష్,సాయికుమార్,ప్రసాద్,రామకృష్ణ ,ద్వారపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొగిరిలో తల్లిపాల వారోత్సవాలు

రాజాం (విజయభాను న్యూస్) : రాజాం మండలం పొగిరి గ్రామంలో గర్భిణీలకు, బాలింతల కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు, రాజాం ప్రాజెక్టు పిఓ డాక్టర్ కనకదుర్గ, ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రసన్న, సర్పంచ్ పొగిరి కృష్ణవేణిమ్మ ,ఎంపీటీసీ మన్మధరావు, పంచాయతీ సెక్రెటరీ పద్మజ చేతులు మీదగా వీటిని పంపిణీ చేశారు, అనంతరం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి మంగదేవి, గీత, ఏఎన్ఎం వరలక్ష్మి, పొగిరి పీహెచ్సీ హెల్త్ సూపర్వైజర్ ధనలక్ష్మి, అంగన్వాడి కార్యకర్తలు విజయ, పద్మావతి మంగమాంబ ,వనజ లక్ష్మి ,రమ ,పద్మ, జ్యోతి, పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి, గ్రామ నాయకులు వండన కుమార్ స్వామి, సచివాలయ సిబ్బంది తదరులు పాల్గొన్నారు

# ఆంగ్ల భాషా బోధన బలవంతంగా రుద్దకూడదు

## భాషా సదస్సులో గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్




సాగర్‌నగర్ **(విజయభాను న్యూస్) :** (విజయభాను న్యూస్) :

భాష అనేది బలమైన ఆయుధం వంటిదని అందులోను ప్రపంచ భాషగా పేరొందిన ఆంగ్లభాషలో ప్రావీణ్యం అవసరమని అయితే ఆంగ్లభాష బోధనను సరైన పద్ధతిలో బోధించకుండా బలవంతంగా రుద్దాలని చూడటం వల్ల మిస్‌ఫైర్‌లా మారుతుందని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆంగ్ల భాషా విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న "అమెరికన్ లిటరేచర్ అండ్ పాపులర్ కల్చర్ " అంతర్జాతీయ సదస్సును గురువారం తేది:03-08-2023న ఆయన ప్రారంభించారు. భాషను లోతుగా అర్థంచేసుకోవాలంటే సంస్కృతి పై అవగాహన అవసరం అన్నారు. భాషలో సృజనాత్మకత, నూతన భావ వ్యక్తీకరణ కాలానుగుణంగా అభివృద్ధి చెందాలన్నారు. కృత్రిమ మేధ, ఛాట్ జిపిటి వంటివి భాషా నిపుణులకు సవాలు విసురుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలోని అగ్ర రాజ్యాలలో భారతీయులు ఉన్నత స్థానంలో నిలవడానికి ఆంగ్ల భాషపై గల పట్టు ఒక కారణం అని తెలిపారు.

ఆంగ్ల భాష, సాహిత్యాలపై భారతీయులు, అమెరికన్‌లు భాషానిపుణులు సంయుక్త అధ్యయనాలు జరపాలని సూచించారు. ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషా విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.శ్రీరమేష్ మాట్లాడుతూ భాషతో ముడి పడిన సంస్కృతిని అర్థం చేసుకోకుండా భావవ్యక్తీకరణ చేయడం సాధ్యపడదన్నారు. ఆంగ్ల భాష బోధనకు ఈ రెండు అవసరమని తెలిపారు. పాపులర్ కల్చర్ అనేది సామాన్యుడి గుండె చప్పుడు అని పేర్కొన్నారు. అమెరికాకు చెందిన బౌలింగ్‌గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ పాపులర్ కల్చర్ విభాగం ప్రొఫెసర్ క్రిస్టెన్ రుడిసెల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంగ్ల భాషా విభాగం విశ్రాంత ప్రొఫెసర్ ఎ.కరుణాకర్, గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ డైరక్టర్ డాక్టర్ బి.నళిని, డాక్టర్ పద్మజ, డాక్టర్ సుష్మారాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# విద్యుత్ షాక్ కు గురై ముగ్గురు మృతి



రాజాం (విజయభాను న్యూస్) : సంతకవిటి మండలం సోమన్నపేట గ్రామంలో విద్యుత్ షాక్ కు గురై ముగ్గురు మృతిచెందారు. . గ్రామానికి చెందిన పాండ్రంకి రామినాయుడు ఇంటి మొదటి అంతస్థు నిర్మాణంలో బాగంగా గురువారం ఉదయం అతని కుమారుడు పాండ్రంకి కేసరి నాయుడు(24) పనికి సిద్దపడ్డాడు. ఇదే సమయంలో అతని స్నేహితుడు గంద్రేటి చంద్రశేఖర్(18) కూడా రావడంతో వీరిద్దరు డాబా ఎక్కి అడ్డంగా ఉన్న ఇనుప రాడ్ ను డాబా పై నుంచి వెనక్కు నెట్టారు. ఈసమయంలో ఇంటి వెనుక ఉన్న స్ట్రీట్ లైన్ 230 వోల్టల విద్యుత్ తీగలకు ఈ ఇనుపరాడ్ తగలడంతో ఇద్దరు యువకులు రాడ్ ద్వారా కరెంట్ సరఫరా కారణంగా మృతిచెందారు. డాబా మీద నుంచి కేకలు వినిపించడంతో ఎదురుగా ఉన్న అంగన్వాడీ ఆయా దూబ రెయ్యమ్మ(57) డాబా ఎక్కి ఈ ఇనుప రాడ్ కి తగలడంతో ఆమె కూడా మృతిచెందింది.

విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంతకవిటి ఎస్ఐ లోకేష్, రాజాం రూరల్ సీఐ ఉపేంద్రలు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదుచేసి శవపంచనామా నిర్వహించారు. జెడీపీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులును పరామర్శించి ఓదార్చారు. మృతుల కుటుంబీకులు కన్నీరులు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామం శోకసంద్రంలో చిక్కుకుంది.

# శతశాతం సమస్యల పరిష్కార దిశగా 'సురక్ష'

## భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భీమిలిపట్నం, (విజయభాను న్యూస్) : భీమిలి నియోజకవర్గం లో పలు కారణాలు చేత సంక్షేమం అందని అర్హులకు జగనన్న సురక్ష కార్యక్రమం కొండంత అండగా నిలిచి లబ్ధి చేకూర్చిందని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం ఉదయం భీమిలి నియోజకవర్గం లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలతో ఆనందపురం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. జగనన్న సురక్ష మగింపు కార్యక్రమం ను ఉద్దేశించి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ జగనన్న సురక్ష అనే కార్యక్రమం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకమునుపు ప్రజలకు ఏదైతే వాగ్దానాలు కేవలం రెండు పేజీల ద్వారా తెలియపరచి.. ఈ నాలుగు సంవత్సరాల కాలంలో సుమారు 99% హామీలను కులాలు చూడకుండా, మతాలు చూడకుండా, రాజకీయాలు చేయకుండా ఆఖరికి పార్టీలు కూడా చూడకుండా లంచాలకు తావు లేకుండా ప్రజలకు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కే చెందిందని పేర్కొన్నారు . మిగిలినవి సమస్యలు కూడా పరిశీలించి పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు ఎలాంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారో వాలంటీర్లు వాటిని నమోదు చేసుకుని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలకు పరిష్కార మార్గం చూపడం జరుగుతుంది అన్నారు. అంతేకాక రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి వినూత్న పాలన ఆలోచన విధానం లో ఎటువంటి రుసుము లేకుండా పూర్తి ఉచితంగా ఈ జగనన్న సురక్ష కార్యక్రమ ఏర్పాటు హర్షించదగ్గ విషయం అని, దీని వలన ప్రతీ ఒక్కరికీ నేరుగా అక్కడి కక్కడే సత్వర పరిష్కారం జరుగిందని,కొన్ని సందర్భాలలో సర్వర్ స్లోగా ఉన్న కారణంగా ఆలస్యమైనా సరే ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావాల్సిన పని లేకుండా వారికి కూడా త్వరితగతిన అందజేయడం జరిగిందన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే సంబంధిత వాలంటీర్ల ద్వారా వాటిని గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించడం కూడా జరిగిందన్నారు. ఇంతటి గొప్ప

కార్యక్రమం ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి గారి ఆలోచన హర్షించదగినది అని జగన్మోహన్ రెడ్డి మస్తిష్కం లో పుట్టిన ఈ ఆలోచన ద్వారా రాష్ట్రంలో 93,17,287 సమస్యలు పరిష్కారం చేయగా మన భీమిలి నియోజకవర్గంలో ఈ నెల రోజుల వ్యవధిలో 47 జగనన్న సురక్ష క్యాంప్ లు నిర్వహించి 1,09,440 కుటుంబాలను నేరుగా కలిసి 25,858 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్ లు అందివ్వడం జరిగిందన్నారు. అది కూడా సురక్ష ద్వారా పైసా రుసుము తీసుకోకుండా కేవలం 24 గం లు వ్యవది లోనే సర్టిఫికెట్ లు అందివ్వడం చాలా సంతోషం గా ఉందని హర్షం వ్యక్తం చేసారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు - మండలం నాయకులు - సచివాలయం కన్వినర్ లు గృహ సారథులు కార్యకర్తలు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

# షణ్ముక్ అనే రౌడీషీటర్ మేడపై నుండి దూకి మృతి

- అనుమానస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు
- మృతదేహాన్ని కే.జి.హెచ్ మార్చురికీ తరలింపు
- పోలీసుల వేధింపులు తల లేక ఆత్మహత్య, మృతుని కుటుంబ సభ్యుల ఆరోపణ



గోపాలపట్నం క్రైమ్ (విజయభాను న్యూస్): పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న కుమారి కల్యాణ మండపం పైనుండి పడి రౌడీ షీటర్ జంపంగి షన్ముఖ్ (30) మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు.బుధవారం రాత్రి మృతుడు షన్ముఖ్ తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు లాడ్జి లో రూమ్ తీసుకొని మద్యం సేవించారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ముగ్గురికి గొడవ జరగడంతో లాడ్జి బాయ్ రూమ్ ఖాళీ చెయ్యమని తెలపడంతో అతనిని కొట్టిన ముగ్గురు వ్యక్తులు. అనంతరం తలుపు గొళ్ళెం పగలకొట్టడం జరిగింది. 1.30 సమయంలో రౌడీ షీటర్ షన్ముఖ్ భవన్ పైనుండి పడి మృతి. మృతుడు షన్ముఖ్ హైద్రాబాద్ నుండి వోచ్చినట్లుగా తెలుస్తోంది. మృతుని శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కె.జి.హెచ్.కు తరలింపు. సంఘటన స్ధలానికి చేరుకున్న క్లూస్ టీమ్. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న గోపాలపట్నం పోలీసులు.

## పోలీసుల వేధింపులు తల లేక ఆత్మహత్య మృతుని కుటుంబ సభ్యుల ఆరోపణ



**పూర్ణ మార్కెట్ :** రౌడీషీటర్ జంపంగి షణ్ముఖ్ పోలీసుల అక్రమ కేసులు, వేదింపులు తట్టుకోలేక నే మృతి చెందడని కేజీహెచ్ మార్చురి దగ్గర ఆందోళనకు దిగిన తలిదండ్రులు మరియు బందువులు కుటుంబ సభ్యుల ఆవేదన వ్యక్తం చేశారు. షన్ముఖ్ కుమార్ ను గత కొంత కాలంగా పోలీసువారు గంజాయి కేసు ల్లో ఇరికిస్తూ ఇంటి వద్ద ఉండవద్దని బెదిరించడం వలన గత సంవత్సరంగా బయట ఉంటున్నారు అయినా పోలీసుల ఒత్తిడి తగ్గక పోవడంతో మానసికంగా క్రుంగి పోయారు పోలీసు వారు వచ్చి కేసు పెడతారు అనీ భయం తో ఒక ఓయో రూమ్ లో ఉన్న నా కోడుకు రెండవ అంతస్తు నుంచి దూకి ప్రాణాలు తీసుకున్నాడు నా కోడుకు చావుకు కేవలం పోలీసు వారు మాత్రమే కారణం అని అ తల్లి వ్యక్తం చేశారు



విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పరిధిలో భారీ వర్షాలకు మురుగు నీరు కాలవ ల్లో స్తంభించిపోయి ఉండటం వలన ఆ మురుగు నీరు పై దోమలు చేరి డెంగ్యూ మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని ముందుగానే గ్రహించి కాలవల్లో అక్రమంగా నిర్మాణం చేపట్టిన నిర్మాణాలను తొలగించి దగ్గరుండి మరీ కాలవలని కాలవలను పూడికల్ని తీపిస్తున్న మన 35వ వార్డు వైసిపి కార్పొరేటర్ విల్లూరు భాస్కరరావు కార్యక్రమంలో 35 వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు GVMC అధికారులు సత్యనారాయణ వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు

## 6 న ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సదస్సు

రాజాం (విజయభాను న్యూస్) : జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల్ని చర్చించడానికి ఈనెల ఆరో తేదీన విజయనగరం లో ప్రాంతీయ సదస్సు జరుగనుంది.ఏపీయిూడబ్ల్యుయూ నిర్వహించే ఈ సమావేశంలో రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. ఐజేయు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు హాజరయ్యే ఈ సమావేశానికి పూర్వ శ్రీకాకుళం జిల్లా జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలి రావాలని యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్ ఈశ్వరరావు, స్సామ్నా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంవీ మల్లేశ్వర రావు ఒక ప్రకటనలో కోరారు.

# విద్యార్థులకు తోడ్పాటు, సహకారం

## పుట్టినరోజు వ్యయంతో విద్యార్థులకు మెమొంటోలు నగదు పంపిణీ



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం : ఉపాధ్యాయుడు తోడ్పాటు సహకారం ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు అధిరోహిస్తారని ఇంగ్లీషు ఉపాధ్యాయుడు ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. తన పుట్టినరోజు సందర్భంగా వేడుకలు జరుపుకోకుండా దానికయ్యే వ్యయంతో విద్యార్థులకు సహాయ సహకారాలు అందించారు. బుధవారం పెద్ద బొడ్డేపల్లి హైస్కూల్లో గతేడాది 20 మంది విద్యార్థులు విద్యార్థులు 500 కంటే ఎక్కువ మార్కులు సాధించారు. అందులో ఇంగ్లీషు 97 మార్కులు వచ్చిన వారు కూడా కలరు. వీరందరికీ వెయ్యేసి రూపాయిలు నగదు, మెమొంటోలను అందించారు ఫ్రాన్సిస్. కార్యక్రమానికి తన తండ్రి ఫ్రాన్సిస్ తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సహచర ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. కౌన్సిలర్ మరియు స్కూల్ కమిటీ చైర్మన్ బేతిరెడ్డి రత్నం విజయ్ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

# నకిలీ పత్రాలు సృష్టించి 32 ఎకరాలు కాజేసే ప్రయత్నాలు



యానం : 2007లో యానం రిజిస్టర్ ఆఫీస్ లో తప్పుడు రిజిస్ట్రేషన్ లు. అప్పటి ప్రజా ప్రతినిధి అండదండలతో ఈ వ్యవహారం. యానాం. విజయ భాను. ఆగస్టు 3 మా భూములు లీజుకు తీసుకొని తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఓఎన్జిసి ద్వారా మాకు రావాల్సిన నష్టపరిహాన్ని మాకు ఇప్పించవలసిందిగా యానం పరిపాలన అధికారి మునుస్వామికి పెద్దాపురం కు చెందిన 15 మంది వారసులు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు కేంద్రపాలిత ప్రాంతం యానం నియోజకవర్గం దర్యాల్ తిప్ప రీజెన్సీ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న రిలయన్స్ సంస్థను ఆనుకొని ఉన్న సుమారు 32 ఎకరాలు ఎకరాలపై కొందరు పెద్దలు కన్ను పడడంతో ఈ భూములు కాజేయడానికి పెద్దాపురంలో నివాసం ఉంటున్న 15 మంది వారసులు లీజు నిమిత్తం 90000 ఇచ్చి ఈ భూములకు సంబంధించిన వారి యొక్క ఫోటోలు తీసుకుని యానం రీస్టాఫీసులో 2007 ఫిబ్రవరి 14న తప్పుడు డాక్యుమెంట్ సృష్టించి వారి సంతకం లేకుండా వారి ఫోటోలను పెట్టి వేరొక రీ వేలు ముద్రలతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు ఈ వ్యవహారం వారికి తెలియకపోవడంతో సుమారు 18 సంవత్సరాలు గడిచిపోయాయి ఈ భూముల నుండి నలుగురు ఆక్రమణదారులు జిఎస్పిసి ఓ న్ జి సి ద్వారా కోట్ల రూపాయలు కాజేసేందుకు ప్రయత్నాలు చేయడంతో స్థానిక నాయకులు ఈ వ్యవహారంపై వారిని కలిసి తెలియజేయడంతో వారు యానం వచ్చి వీరిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు ఈ వ్యవహారంపై తెలుగు జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు పెద్దింశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో ఇప్పటివరకు దొంగ రిజిస్ట్రేషన్ చేయడం చూడలేద యజమాన్లు లేకుండా తప్పుడు రిజిస్ట్రేషన్ చేసే పద్ధతి యానంలోనే ఇప్పుడు వెలుగులోకి వచ్చిందని ఈ వ్యవహారంపై అధికారులు నెగ్గెల్చి వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారి యొక్క వివరాలను వెల్లడించారు

# ఈనెల 17 నుంచి సిపిఐ బస్సు యాత్ర



కాకినాడ, ఆగస్టు 3 : దేశంలో ప్రజాస్వామ్యం మాయమైందని మానవ హక్కులు హరించబడ్డాయని దళితులు, ఆదివాసీలు, మైనార్టీలపై దాడులు జరుగుతు న్నాయని, రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని ఈ రెండు ప్రభుత్వాలు వ్యతిరేకంగా భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఈ నెల 17 నుండి 27 వరకు బస్సు యాత్ర జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక గాంధీభవన్లో సిపిఐ రెండు రోజుల శాఖ కార్యదర్శుల వర్క్ షాప్ను ఆయన ప్రారంభించారు. అంతకుముందు పార్టీ పతాకాన్ని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు ఆవిష్కరించారు.

ఈ ప్రారంభ సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి కే బోడకొండ

అధ్యక్షత వహించారు. ముందుగా డేగ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణ మైన మణిపూర్లో అల్లర్లకు, అత్యాచారాలకు, మారణ కాండకు బిజెపి విధానాలే కారణమని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు స్పందించిన తర్వాత నరేంద్ర మోడీ స్పందించారని అదేవిధంగా పార్లమెంట్లో ప్రతిపక్షాలు ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తున్నా ఇప్పటివరకు మోడీ మాట్లాడలేదన్నారు.

ఈనెల 17న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ నుండి సిపిఐ బస్సు యాత్ర ప్రారంభం అవుతుందని దీన్ని అన్ని వర్గాల వారు జయప్రదం చేయాలని డేగ పిలుపునిచ్చారు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ శాఖా కార్యదర్శుల వర్క్ షాప్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని దేశంలో రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి సత్యనారాయణ, పిఎస్ నారాయణ, టి అన్నవరం, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కే ఆదినారాయణమూర్తి, సిపిఐ సీనియర్ నాయకులు చింతపల్లి సుబ్బారావు, మున్సిపల్ కార్మిక నాయకులు రాజేష్, అన్నవరం, ఏఐవైఎఫ్ కన్వీనర్ కాశీ విశ్వనాథ్ ప్రజా నాట్యమండలి కళాకారులు మడగల రమణ, అర్జున్ రావు, కె అప్పలరాజు కాకినాడ జిల్లా వ్యాప్తంగా శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు

## 6వ తేదీ నుండి సత్యదేవుని సన్నిధిలో ధర్మ ప్రచార మాసోత్సవాలు

అన్నవరం....కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం నందు "ధర్మ ప్రచార మాసోత్సవములు" ది.06.08.2023 వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించుటకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు. సత్యనారాయణ చే కొండపై సుమారు 500 మంది కళాకారులతో వివిధ సంస్కృతిక కార్యక్రమలతో అత్యంత వైభముగా ప్రారంభించబడును. - కార్యక్రమముల వివరములు.

1)ఆంధ్ర రాష్ట్ర ప్రజల శాంతి సౌభాగ్యాల కోసం ఉదయం 5 గంటల నుండి 7.00 గంటల వరకు శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం. 2) ఉదయం 9.00గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రములు సమర్పణ. 3) ఉదయం 9:30 ని.లకు ధర్మ ప్రచారం కొరకు సత్యదేవుని ప్రచార రథం ప్రారంభించుట. తదుపరి అడ్డతీగల గ్రామం నందు సామూహిక వ్రతములు నిర్వహించబడును. 4)ఉదయం 10 గంటలకు ధర్మ ప్రచార సభ జరుగునని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆజాద్ తెలిపారు.

## వై సి పీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ని కలిసిన భీమిలి వై సి పీ యువజన విభాగం నాయకులు



భీమునిపట్నం : విజయభాను న్యూస్ విశాఖపట్నం జిల్లా వై యస్ ఆర్ సి పి ఆఫీసులో జిల్లా అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేసిన కోలా గురువులు ని భీమిలి యువజన విభాగం నాయకులు భింగి హరికిరణ్ రెడ్డి , ఇల్లాపు వెంకటరావు, రాంభక్త ప్రభాకర్ నాయుడు,కొయ్య రామకృష్ణ కలిసి వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఎం సంతోష్,షేక్ ఖాదర్ వలీ, ఎం .గౌరీ శంకర్, ఆర్.మోహన్,ప్రభాకర్, పాల్గొన్నారు

## బాలింతలకు శ్రీమంతం....గర్భిణీలకు పౌష్టిక ఆహార కిట్లు పంపిణీ



గాజువాక(విజయభాను న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోన్న వై ఎస్ ఆర్ సంపూర్ణ పోషణ పేరుతో బాలింతలకు, గర్భిణీలకు టేక్ హోమ్ రేషన్ పంపిణి కార్యక్రమాన్ని జీవీఎంసీ 74 వ వార్డు పరిధి టీ ఎన్ ఆర్ కళ్యాణమండపంలో 74వ వార్డు కార్పొరేటర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ తిప్పల వంశీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే నాగిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరికి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న ముఖ్యంగా బాలింతలు, గర్భిణీలు కూడా పౌష్టిక ఆహారం తోనే లభిస్తుందని అన్నారు. మహిళభివృద్ధు, శిశువు సంక్షేమమే ద్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలద్వారా అత్యధిక పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నారని గుర్తు చేశారు. టేక్ హోమ్ రేషన్ కింద బాలింతలకు, గర్భిణీలకు మూడు కేజీల బియ్యం, కందిపప్పు కేజీ, ఐదు లీటర్లు పాలపేకాట్స్, 25 గుడ్లు మొదలగు 10పౌష్టిక ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. బాలింతలు, గర్భిణీలు సంపూర్ణ ఆరోగ్యంతోనూ అలాగే శిశువుకీ మంచి ఆరోగ్యంగా ఉండాలన్న ఎటువంటి ఆహారాన్ని తీసుకోవాలి అలాగే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులచే క్లుప్తంగా వివరించారు. అనంతరం గర్భిణీలకు శ్రీమంతంతో పాటు పుట్టిన బిడ్డలకు అన్న ప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి,కార్పొరేటర్ వంశీ రెడ్డి,జోన్6 జోనల్ కమిషనర్ సింహాచలం.ఎంఓ గాజువాక డా బద్రీనారాయణ మూర్తి, సీ హెచ్ ఓ నాగాప్పారావు, ఆరోగ్య విస్తరణ అధికారి పెదగంట్యాడ పీ హెచ్ సీ టంకాల సత్యనారాయణ, సర్కిల్ -3 పౌరసరఫరాల శాఖ అధికారి టి కృష్ణ, ఎం ఇ ఓ లు కే. రమణజీ, ఇ. శ్రీనివాసరావు, మహిళా మండలి కన్వెన్షన్ ఈశ్వరరావు, సీడీపీఓ నీలవేణి, ఇ ఓ స్రవంతి, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా చినతల్లి వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి : అవంతి



భీమునిపట్నం : విజయభాను న్యూస్ జీ వి ఎంసి భీమిలి జోన్ 1వ వార్డు పరిదిలోలక్ష్మీవారం గ్రంథాలయం ఏరియాలో ఏర్పాటు చేసిన రెడ్యూస్ రియూజ్ రీ సైకిల్ ( ఆర్ ఆర్ ఆర్) సెంటర్ ను భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు చేతులు మీదుగా ప్రారంభోత్సవం చేశారు.అనంతరం అవంతి మాట్లాడుతూ మానవాళి మనుగడ కోసం పలు కారణాలు చేత చెట్లు నరకడం పకృతి విపత్తు వలన చెట్లు పెకిలింపబడటం,అంతేకాక అధిక వాహన వినియోగాలు వలన పొగ కాలుష్యం ఏర్పడటం, రసాయన ఎరువులు తో పంటలు పండించడం వలన,ఇలా ఎన్నో విషయాలు వలన సమాజంలో మనిషి ఆరోగ్య సమస్యల్ని ఎదుర్కొంటూ ఆయుస్కాలం తగ్గించుకోవడం జరుగుతుంది అని,అన్నింటి కంటే అతి ప్రాముఖ్యమైన విషయం మన చుట్టు ఉండే పరిసరాలు పరిశుభ్రత లేకుండా చెత్త చెదారం తో పాటు గా వాడిన ప్లాస్టిక్ సీసాలు ,గాజు గ్లాసులు,పనికిరాని వస్త్రాలు,పింగాణి పాత్రలు ఇలా పలు రకాలైన వ్యర్థ పదార్థాలు ఎక్క బడితే అక్కడ పడేయడం వలన మానవాళికి మాత్రమే కాకుండా జంతువులు కు పశువులకు కూడా ముప్పు వాటిల్లడం జరుగుతుందని వీటి వలన మనకు మనమే అనారోగాలు కొని తెచ్చుకునే పరిస్థితి నెలకొంటుందని అలాంటి ప్లాస్టిక్ , గాజు,పింగాణి,పాడై పోయిన వస్త్రాలు ను ఎక్కడి బడితే అక్కడ పడేయకుండా ఈ రెడ్యూస్ రియూజ్ రీ సైకిల్ సెంటర్ కి అందించినట్లు అయితే వాటిని మరల రీసైక్లింగ్ చేయబడి పర్యావరణ కి ముప్పు వాటిల్లకుండా చేసిన వారవుతారని దీని విషయమై ప్రతీ ఒక్కరు ప్లాస్టిక్ నిర్మూలనకు తమ వంతు గా కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము రెండో వార్డ్ ఇన్ ఛార్జ్ శిల్ల సరళారాణి కరుణాకర్ రెడ్డి కోఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి వై సి పీ నాయకులు అక్రమాని రామునాయుడు , జగ్గు పల్లి ప్రసాద్,ఎస్ కరుణాకర్ రెడ్డి , హరి కిరణ్ రెడ్డి వంశీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## ఆయిల్ ఫామ్ తోటలను ప్రోత్సహించాలి

భీమునిపట్నం : విజయభాను న్యూస్ భీమిలి మండలం మజ్జి వలస గ్రామంలో శారద వ్యాలీ డెవలప్మెంట్ సమితి మరియు శాంతి ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ వి.మాడుగుల సంయుక్తంగా ఏర్పాటుచేసిన సభలో జిల్లా హార్టికల్చర్ ఆఫీసర్ మన్మధ రావు మరియు మండల హార్టికల్చర్ అధికారిని స్వాతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ముందుగా జిల్లా అధికారి మన్మధ రావు మాట్లాడుతూ రైతులకు ఆయిల్ ఫామ్ తోటల గురించి వాటి యొక్క లాభాలు గురించి వాటిలో చేయవలసిన కార్యక్రమాల గురించి సస్యరక్షణ గురించి వివరించారు ఆయిల్ ఫామ్ తోటలు వేయడం వల్ల కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వము సంయుక్తంగా రైతులకు సబ్సిడీ మీద ఏరకంగా అందజేస్తున్నాయి .

## బ్యాంక్ ఉద్యోగిని ఆత్మహత్య



ములగాడ( విజయభాను న్యూస్ ఇందిరా కాలనీ సచివాలయం మహిళా పోలీస్ గా సేవలుఅందించి, ఇటీవలే రాజమండ్రి యూనియన్ బ్యాంక్ లో ఉద్యగంలోచేరిన ఓ బ్యాంక్ఉద్యోగిని ఫ్యాన్ కు ఉరి పోసుకొని ఆత్మ హత్యకు పాల్పడింది. మల్కాపురం పోలిస్టేషన్ పరిధి శ్రీహరిపురం రాంనగర్ వద్ద గురువారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం......శ్రీహరిపురం రాంనగర్ లో పీలా ఇద్రాదేవి(26) తమ తల్లిదండ్రులతో ఉంటుంది. ఇందిరాకాలనీ సచివాలయంలో మహిళా పోలీస్ గా విధులు నిర్వహిస్తుంది. అయితే ఇటీవలే రాజమండ్రి దగ్గర లో యూనియన్ బ్యాంక్ ఉద్యోగిగా పోస్టింగ్ రావడంతో అక్కడకు వెళ్ళింది. దింట్లో భాగంగా ఆమె ట్రైనింగ్ కోసం విశాఖపట్నం వచ్చింది. అయితే తెల్లవారుజామున ఫ్యాన్ హుక్ కు ఉరి పోసుకొని ఆత్మ హత్య కు పాల్పడడంతో తండ్రి రాము పోలీసులకు పిర్యాదు చేసాడు. ఫిర్యాదు మీదకు మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కేజీహెచ్ కు తరలించారు. అనుమానస్పద మృతి గా కేసు నమోదుచేశామని, మరణానికి కారణాలు తెలియాల్సి ఉందని, మల్కాపురం సీఐ జీడీ బాబు పర్యవేక్షణలో కేసు నమోదు దర్యాప్తుచేసి దర్యాప్తు చేపట్టినట్లు మల్కాపురం పోలీసులు తెలిపారు.

# బంద్ విజయవంతం



అనంతగిరి విజయభాను న్యూస్ : అనంతగిరి మండల కేంద్రం, బొర్ర, చిలకలగెడ్డ వెంకయపాలేం వద్ద 3 ప్రాంతాల్లో బంద్ విజయవంతం బంద్ లో పాల్గొన్న అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు, ఈ సందర్భంగా జడ్పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ ఉత్తరాదిన ఉన్న మణిపూర్ రాష్ట్రంలో జరిగిన మతోన్మాదుల హింసకాండను నిరసిస్తూ గిరిజన సంఘం ఆధ్వర్యాన జరిగిన ఏజెన్సీప్రాంతంలో బంద్ విజయవంతమైంది

కేంద్రంలో నరేంద్ర మోడీ మణిపూర్ రాష్ట్రంలోప్రభుత్వ అరాచక పాలనతో డబుల్ ఇంజన్ పేరుతో మణిపూర్ రాష్ట్రంలో లోయ ప్రాంతంలో ఉన్న మైట్టిలు,కొండ ప్రాంతంలో కుక్కి నాగజాతుల మద్య జాతుల పేరుతో రెచ్చగొట్టి మతాల మద్య చిచ్చు పెట్టి హిందువులు,క్రిస్టియన్ ల మధ్య తగాదాలు పెట్టించి మారణహోమం సృష్టించి క్రిస్టియన్ లపై మైట్టి తెగకు చెందిన హిందువుల చేత కుక్కి తెగకు చెందిన క్రిస్టియన్ లపై దాడులు చేస్తూ,వందల చర్చిలను తగలబెట్టి కుక్కి తెగకు చెందిన మహిళలను 2 కిలోమీటర్ల దూరం ఊరేగించి అత్యాచారం,హత్య చేశారు మణిపూర్ లో ఉన్న మైట్టిలను ఆయుధాలు కుక్కిలపై దాడిచేయిస్తూ వారు ఉన్న కొండ ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు.కుక్కిలు నాగ జాతులు ఉన్న ప్రాంతాలంత ఖనిజ నిక్షేపాలు వనరులు ఉన్న ప్రాంతం అక్కడ నుండి వందలాది మంది గిరిజనులను చంపి 50 వేలమంది గిరిజన జనాభాకు నిరాశ్రయులను చేస్తూ ఆయా ప్రాంతాల నుండి ఖాళీ చేయిస్తున్నారు. నరేంద్ర మోడీ అడుగులకు మడుగులొత్తు తున్న అదాని,అంబానీలకు ఖనిజ నిక్షేపాలు ఉన్న ప్రాంతాలు కట్టబెట్టడంకోసం 1980 భూపరిక్షణ చట్టం 2006 అట్టవీ హక్కుల చట్టం సవరణ చేసి పార్లమెంట్ లో బిల్లు ఆమోదించారు. చట్టంలో ఉన్న హక్కులను సవరణ చేస్తూ ఏకపక్షంగా నిర్ణయాన్ని అమలు చేశారు

బోయ వాల్మీ కిలను ఎస్టీల జాబితాలో చేర్పించవద్దు అసెంబ్లీ తీర్మానం రద్దుచేయాలని జి ఓ నెం 3 రిజర్వేషన్ల చట్టబద్ధత కల్పించాలని పోలవరం సమస్యలను పరిష్కరించాలని నాన్ షెడ్యూల్ ఏరియా గ్రామాలను 5 వ షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం ఫీటర్ నీలయ్య గారు,జోషఫ్ గారు,దేముడుబాబు గారు,జఫన్య గారు రూబేన్మహిళ సంఘాల నాయకులు బాక కాసులమ్మ,నందుల వరహాలమ్మ ఎస్.ఎఫ్.ఐ నాయకులు శ్రీను భీమరాజు కలశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇఎస్ఐ ఆసుపత్రి స్థలంలో అక్రమ వంతెన కట్టడం తొలగించాలి

### - బీజేపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు



గాజువాక(విజయభాను న్యూస్) : శీలానగర్ ఇఎస్ఐ ఆసుపత్రి దగ్గర అక్రమంగా నిర్మిస్తున్న కల్వర్టు వద్ద బీజేపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు ఆద్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్బంగ నరసింగరావు మాట్లాడుతూ ప్రదాని మోదీ నాయకత్వంలో బీజేపి కేంద్ర ప్రభుత్వం నాలుగు వందల పడకల ఇఎస్ఐ ఆసుపత్రికి మూడు వందల ఎనభై నాలుగు కోట్లు కేటాయించిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వలన పనులు ప్రారంబించడంలో ఆలస్యమైనదని అన్నారు. అధికారులు నాయకులు కుమ్మక్కై రియల్ ఎస్టేట్ వ్యక్తులకు ఉపయోగపడే విదంగా కల్వర్టు రోడ్డు నిర్మిస్తున్నారని అన్నారు. ఆసుపత్రి పనులు వెంటనే పూర్తి చేసి లక్షలాది కార్మికులకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో నాతయ్యపాలెం మండల అధ్యక్షులు అప్పలరాజు 69వ వార్డు అధ్యక్షులు శ్రీనివాసరావు ,నాగేశ్వరరావు పేర్ల అప్పారావు , రామస్వామి , వెంకటనారాయణ , రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పాలు అమృతం కన్నా మేలు

### చెరుకు బిడ్డ తల్లిపాల వారోత్సవాల్లో ఎంపీపీ శెట్టి నీలవేణి



విజయభాను. న్యూస్ : అనంతగిరి, తల్లి పాలు అమృతం కన్నా పిల్లలకు మేలు చేకూరుస్తుందని అనంతగిరి ఎంపీపీ శెట్టి నీలవేణి వ్యాఖ్యానించారు. గుమ్మ పంచాయతీ చెరుకుబిడ్డ అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిపాల వారసు వాళ్ళ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెరుకుబిడ్డ గ్రామంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ గాయత్రి , మాన్సీ కోఆర్డినేటర్ సంపత్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కృష్ణమూర్తి ,జాగరపు శ్రీను, దురియా సత్యనారాయణ అంగన్వాడి కార్యకర్తలు బాలింతలు పాల్గొన్నారు .

# ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పెండింగ్ పనులు త్వరతగతిన పూర్తి చేయండి

## - జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ



విశాఖపట్నం **(విజయభాను న్యూస్) :** బీచ్ రోడ్డులోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలని జివిఎంసి కమిషనర్ సీ ఎం సాయికాంత్ వర్మ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బీచ్ రోడ్ లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను, జ్ఞానాపురం, కంచరపాలెం, ఎన్ఏడి, గోపాలపట్నం, వేపగుంట, సింహాచలం, బిఆర్టిఎస్ రోడ్ తదితర ప్రాంతాలలోని జంక్షన్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బీచ్ రోడ్ లోని స్విమ్మింగ్ పూల్ పెండింగ్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని, ప్రహరీ ఆకర్షనీయంగా రంగులతో తీర్చిదిద్దాలని, స్విమ్మింగ్ పూల్ అంతర్భాగంలోని రోడ్లు పూర్తిచేయాలని, పిల్లల ఈత కొలను యొక్క పెండింగ్ పనులు త్వరతగతిన పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్, కార్యనిర్వాక ఇంజనీర్లు సుధాకర్ ను ఆదేశించారు. అనంతరం నగరంలోని పలు జంక్షన్లను పరిశీలించి ప్రతి జంక్షన్లో నూ పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు, వ్యర్ధాలు అధికంగా ఉన్నాయని, వెంటనే పారిశుధ్య కార్మికులచే పూర్తిస్థాయిలో వాటిని తొలగించాలని సంబంధిత అధికారుల వాకి టాకీ ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

# ఏపీఎల్ సీజన్-2 వేలంలో మెరిసిన శ్రీకర్ సాయి రెడ్డి




మధురవాడ (విజయభాను న్యూస్) : ఏసీఏ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 క్రికెటర్ల వేలం గురువారం విశాఖలోని హోటల్ గ్రీన్ పార్క్ లో నిర్వహించారు. అయితే ఈ లీగ్ కు సంబంధిచిన వివరాలును ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి వెల్లడించారు. మొత్తం ఆరు జట్ల ప్రతినిధులు పాల్గొనగా, ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు కె.ఎస్. భరత్ ను రూ.6 లక్షలకు, బెజవాడ టైగర్స్ జట్టు రిక్కీభుయ్యు రూ. 8.10 లక్షలకు, రాయలసీమ కింగ్స్ జట్టు హనుమవిహారిని రూ.6.60లక్షలకు, పి.గిరినాథ రెడ్డిని రూ.6.10 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ టోర్నమెంట్ ఈనెల 16 నుంచి 27వ తేదీ వరకు విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో జరగనున్నాయి. అయితే ఆల్ రౌండర్ గా పేరు తెచ్చుకున్న విశాఖకు చెందిన క్రీడాకారుడు జి. శ్రీకర్ సాయి రెడ్డిని కోస్టల్ రైడర్స్ 3.90 లక్షలకు సొంతం చేసుకోవడంతో విశాఖలో క్రికెట్ ప్రేమికులకు మరింత జోష్ ను నింపుతుందని నిర్వాహుకులు ఆశాభావం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథరెడ్డి, వ్యాఖ్యాత చారుశర్మ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించిన జగనన్న సురక్ష

- జగనన్న సురక్షతో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన
- అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలు అందకుండా ఉండరాదు
- నెడ్ క్యాప్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు



సీతమ్మధార (విజయభాను న్యూస్) : ప్రజల గడప వద్దకే ప్రభుత్వ పాలన అందించాలన్న లక్ష్యంతో ప్రజాసమస్యలను స్వయంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కరించాలన్న వినూత్న ఆలోచనతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మానస పుత్రికగా ప్రారంభమైన 'జగనన్న సురక్ష' కార్యక్రమం రాష్ట్రంలో సరికొత్త చరిత్రను సృష్టించిందని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త ,రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు అన్నారు. గురువారం విశాఖ ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేకే రాజు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పౌరుడినీ ఆప్యాయంగా పలకరించి, ప్రతి గడపకు స్వయంగా వెళ్లి ప్రతి తల్లీ, తండ్రీ, అక్కా, చెల్లీ అంటూ పలకరించి,ప్రభుత్వ సేవలను అందుకోవడంలో వారికేమైనా సమస్యలున్నాయా అనేది అడిగి తెలుసుకుని సమస్యలు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించడం కోసం సీఎం జగన్ జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారనీ అన్నారు.

ప్రజలు ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తన ప్రతినిధులుగా అధికారులు, వాలంటీర్లు నేరుగా ఇంటింటికీ వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కరించాలని సీఎం జగన్ ఆకాంక్షించారనీ అన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందకుండా మిగిలిపోకూడదన్న ఉద్దేశంతో, ప్రజలెవరూ ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించాలనే ముఖ్యమంత్రి జగన్ సంకల్పం సురక్ష కార్యక్రమం ద్వారా నెరవేరిందనీ అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందాలని, అందుకోసం వారికెలాంటి ఇబ్బందులు ఎదురు కాకూడదనే ఆలోచనతో, పూర్తి నిబద్ధత, అంకితభావంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జూన్ 23న ప్రారంభించిన జగనన్న సురక్ష అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చిందన్నారు. ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్‌లను, ఇతర సేవలను యుద్ధప్రాతిపదికన ప్రతి ఒక్కరి ఇంటి వద్దకే అందిస్తూ కొనసాగిందన్నారు.

ఈ కార్యక్రమం కోసం ప్రభుత్వం సీనియర్ ఐఏఎస్ అధికారుల నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు అందరి సేవలను సమర్థవంతంగా వినియోగించింది. గతంలో ఏ ప్రభుత్వమూ ఇలాంటి కార్యక్రమాల అమలు గురించి కనీసం ఆలోచించిన దాఖలాలు కూడా లేవని తెలియజేశారు..

జులై 1వ తేదీ నుంచి 31 వరకు అంటే 30 రోజులపాటు వైస్సార్సీపీ ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందనీ అన్నారు.

ఈ కార్యక్రమం లో ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ రావు,డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబెర్ కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కతారి అనిల్ కుమార్ రాజు, కె వి యన్ శశికళ, ఆళ్ళ లీలావతి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ,నీలి రవి,కె.పి రత్నాకర్, డైరెక్టర్లు పైడి శ్రీను, రాయుడు శ్రీను, నూకరాజు, గంగామహేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ హబ్‌గా తిరుపతి

- అత్యాధునికంగా ప్రారంభించనున్న ఆంకాలజీ లో బంకర్ బ్లాక్ భవనం
- స్విమ్స్‌లో వసతి భవనం, బాలమందిర్‌లో హాస్టల్ బ్లాక్‌లను ప్రారంభించిన చైర్మన్, ఈవో



తిరుమల/తిరుపతి (విజయభాను న్యూస్) : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం మేరకు టీటీడీ తిరుపతిని మెడికల్ హబ్‌గా తయారు చేస్తోందని టీటీడీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి చెప్పారు. స్విమ్స్‌లో రూ.1.95 కోట్లతో నిర్మించిన రోగుల సహాయకుల వసతి భవనాన్ని గురువారం సాయంత్రం ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. వసతి భవనాన్ని పరిశీలించి రోగుల సహాయకులతో మాట్లాడారు. అనంతరం వారికి అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో స్విమ్స్, బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం




పేదలకు విశేష వైద్యసేవలు అందిస్తున్నాయని చెప్పారు. టాటా క్యాన్సర్ ఆసుపత్రి, అరవింద కంటి ఆసుపత్రిని కూడా తిరుపతికి తీసుకురావడానికి టీటీడీ తన వంతు సహకారం అందించిందన్నారు. రాబోయే రోజుల్లో స్విమ్స్‌లో శ్రీ బాలాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. తిరుపతి నగరం నడిబొడ్డున పేదలకు అనేక వ్యాధులకు సంబంధించి కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మిన్నగా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. స్విమ్స్ లో వందలాది మంది రోగులు వైద్య చికిత్సలు పొందుతూ ఉంటారని, వార్డుల్లోని వారి సహాయకులు వసతి కోసం చాలా ఇబ్బంది పడుతూ ఉండటాన్ని తాను స్వయంగా గుర్తించి ఓపి బ్లాక్ ఎదురుగా తాత్కాలికంగా షెడ్లు వేసి వారికి వసతి కల్పించామన్నారు. ప్రస్తుతం రూ.2 కోట్లతో అన్ని వసతులతో పక్కా భవనం నిర్మించామని, ఇక్కడ వారికి అన్నప్రసాదం కూడా అందించే ఏర్పాటు చేశామని వివరించారు. ఈ భవనంపైన మరో రెండు అంతస్తులు నిర్మించడానికి రూ.4.40 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రోజుకు కనీసం నాలుగైదు వందలు పెట్టి లాడ్జీలో రూములు తీసుకోలేని పేదలకు ఈ వసతి భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్య చికిత్సలు, వైద్య సేవలు అందించేందుకు 2023 మే 25వ తేదీ రూ.124 కోట్ల వ్యయంతో శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆసుపత్రిలో కీలకమైన బంకర్ బ్లాక్ భవనాల నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. ఈ ఆసుపత్రిలో రూ.200 కోట్ల వ్యయంతో అత్యాధునిక యంత్రాలు, సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా రూ.97 కోట్లతో కార్డియో న్యూరో బ్లాక్ నిర్మాణానికి తమ పాలకమండలి ఆమోదం తెలిపిందన్నారు. శ్రీనివాస సేతు నిర్మాణపనుల్లో పాల్గొంటూ ఇద్దరు కూలీలు చనిపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రమాదం కారణంగా గడ్డర్ విరిగిపోయి నిర్మాణం ఆలస్యమైందని, ఈ నెలాఖరుకు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**ఎస్వీ బాల మందిర్ అదనపు హాస్టల్ బ్లాక్ ప్రారంభం....**

అంతకుముందు రూ.10.75 కోట్లతో నిర్మించిన ఎస్వీ బాల మందిర్ అదనపు హాస్టల్ బ్లాక్ భవనాన్ని ఛైర్మన్ శ్రీ వైవి.సుబ్బారెడ్డి ఈవో ధర్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియతో మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారిని బాగా చదివించి ప్రయోజకులను చేయడానికి 1943లో ఎస్వీ అనాథ శరణాలయాన్ని టీటీడీ ప్రారంభించిందన్నారు. 1961లో అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఎస్వీ అనాథ శరణాలయాన్ని సందర్శించి ఎస్వీ బాలమందిర్‌గా పేరు మార్చారని చెప్పారు. అనంతరం బాలమందిర్ నిర్వహణ కోసం టీటీడీ ప్రత్యేకంగా ట్రస్టు ప్రారంభించిందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ చదువుకున్న పిల్లలు నేడు మంచి స్థానాల్లో ఉన్నారని, 1వ తరగతి నుండి డిగ్రీ వరకు 500 మంది



విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతూ చదువుకుంటున్నారని చెప్పారు. వీరికి చదువుతో పాటు చక్కటి వసతి, భోజన సదుపాయాలు టీటీడీ కల్పిస్తోందని, బాలమందిర్‌లో చదువుకుని పిజి, ఇంజినీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ లాంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడం జరుగుతోందని వివరించారు. 5 ఫ్లోర్లతో ఈ కొత్త హాస్టల్ బ్లాక్ నిర్మించామని, విద్యార్థులు చదువుకోవడానికి, భోజనం చేయడానికి ప్రత్యేకంగా హాళ్లు ఉన్నాయని చెప్పారు. శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఇక్కడ చదువుకుంటున్న విద్యార్థులందరూ మంచి స్థాయికి చేరుకుని సమాజానికి ఉపయోగపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జెఈవో సదా భార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డిఈవో భాస్కర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, విజివో మనోహర్, బాలమందిర్ ఎఈవో అమ్ములు తదితరులు పాల్గొన్నారు.



VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com